
# సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 26 । నవంబర్ । 2024


## ‘కుడా’ మాస్టర్ ప్లాన్ 2041 విడుదల

**నయీంనగర్:** విస్తరించిన ‘కుడా’ మాస్టర్ ప్లాన్ -2041ని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. హైదరాబాద్ తరువాత రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి హామీ చకాచకా అమలులోకి వస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ పట్టణాన్ని మహానగరంగా విస్తరించడానికి పూర్తి డీపీఆర్ సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్-2041 విస్తరణలో భాగంగా వివిధ జోన్లలో ఏర్పాటుకానున్న మౌలిక వసతుల వివరాలు డీపీఆర్‌లో పొందుపర్చారు.



## శివోహం..



కార్తీకమాసం.. చివరి సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా శివాలయాల్లో ప్రత్యేక అభిషేక, అర్చన పూజలు నిర్వహించారు. హనుమకొండ వేయి స్తంభాల దేవాలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీరుద్రేశ్వరస్వామికి లక్షబిల్వార్చన చేశారు. వేలాది మంది భక్తులు సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తాటిపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యాన ఆలయ ప్రాంగణంలోని మారేడు చెట్టుకింద భక్తులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.

**- హన్మకొండ కల్చరల్**

## న్యూస్‌రీల్

### కనీస పెన్షన్ అమలు చేయాలి



**హన్మకొండ అర్బన్:** పెన్షనర్లకు కనీస పెన్షన్ చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెన్షనర్ల సమస్యలపై సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గం నగరంలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు పెన్షన్ విభాగాధిపతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి యాదగిరి, రెండు జిల్లాల ప్రధాన కార్యదర్శులు సముద్రాల లక్ష్మీనారాయణ, నారాయణగిరి వీరన్న, ఈపీఎస్ పెన్షనర్ల కన్వీనర్ వుప్పు సమ్మయ్య, నాయకులు ఎస్ఎస్ చారి, కుమారస్వామి, జగన్నాథం, శాయన్న, కళ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### నిట్‌లో జీయాన్ ప్రోగ్రామ్స్ షురూ



**కాజీపేట అర్బన్:** నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో సోమవారం ఐదు రోజుల రెండు జీయాన్ (గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్స్) ప్రోగ్రామ్‌లను అట్టహాసంగా ప్రారంభించారు. ‘ఫిజిక్స్ బేస్డ్ అండ్ డాటా డ్రైవెన్ మోడలింగ్ ఇన్ ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సస్టెనెబుల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, అడిటివ్ కోటింగ్ సబ్‌ట్రాక్టివ్ అండ్ హైబ్రిడ్’ పేరిట ఏర్పాటు చేసిన ఐదురోజుల జీయాన్ ప్రోగ్రామ్‌ను క్వీన్ మేరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చిన్నపాట్ పన్‌వీసావస్, స్వీడెన్ యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ జోషి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వేణుగోపాల్, మంజయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి వ్యాసరచన పోటీలు

**విద్యారణ్యపురి:** ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి జిల్లా క్వాలిటి కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ‘పునరుత్పాదక ఇంధన వనరులు’ అంశంపై వ్యాస రచన పోటీ లుంటాయని తెలిపారు. జిల్లాలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈనెల 26న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు సంబంధించి సందేహాలుంటే జిల్లా ప్రోగ్రాం ఆర్గనైజర్ మధుసూదన్‌రెడ్డి 98498 34110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### బాలల వైజ్ఞానిక ప్రదర్శనల సన్నాహక సమావేశం



**విద్యారణ్యపురి:** హనుమకొండ జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్‌ఫెయిర్ నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని సోమవారం ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ ఉన్నత పాఠశాలలో డీఈఓ వాసంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న బాలల వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీల కన్వీనర్లు, కో–కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు సూచనలిచ్చారు. ఎగ్జిబిట్లు ప్రదర్శించేందుకు, తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌స్వామి, హెడ్మాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, తేజస్విని హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్, వివిధ కమిటీల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్.. వసూళ్లు

**స్థలాల మార్కెట్ విలువ పేరుతో బేరసారాలు**

- క్షేత్రస్థాయిలో కొందరు వార్డు ఆఫీసర్ల నిర్వాకం
- చేతులు తడపకుంటే యజమానులకు కొర్రీలు
- తప్పుడు లెక్కలతో అధిక ఫీజుల విధింపు
- టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు



తిమ్మాపురంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ఖాళీ స్థలం

**వరంగల్ అర్బన్:** ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో కొంత మంది వార్డు ఆఫీసర్లు అక్రమ వసూళ్లకు తెరలేపారు. స్థలాల మార్కెట్ విలువల తేడాలను చూపిస్తూ.. ఫీజుల హెచ్చు, తగ్గింపు పేరుతో యజమానులతో బేరసారాలకు దిగుతున్నారు. ‘కొంత మేరకు ఫీజు బెనిఫిట్ చేస్తాం.. ఫైల్ క్లియర్ చేయిస్తాం.. ఫీజులు కడితే చాలు ప్రొసీడింగ్ కాపీ తెచ్చి మీ చేతుల్లో పెట్టే బాధ్యత మాది’ అంటూ భరోసా కల్పిస్తున్నారు. ఒక్కో దరఖాస్తుదారు నుంచి రూ.5వేల నుంచి రూ.10 వేలు దండుకుంటున్నారు. మరికొందరు ఫార్మాలిటీ పేరుతో పచ్చనోట్లను డిమాండ్ చేస్తున్నారు. ఫైళ్ల ప్రాసెసింగ్ తొలి దశలోనే వార్డు ఆఫీసర్లు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మార్కెట్ విలువలో తేడాలు..**

గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖకు చెందిన వీఆర్‌ఏ, వీఆర్‌ఓలపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో ఆ వ్యవస్థను రద్దు చేసింది. వీరిలో ఆరుగురు వీఆర్‌ఓలు, 38 మంది వీఆర్‌ఏలను ఏడాదిన్నర క్రితం బల్దియా ఉద్యోగులుగా విలీనం చేశారు. వివిధ విభాగాల్లో 22 శాశ్వత ఉద్యోగులు, 44 మంది వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు మొత్తం 66 మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం 11 మంది టీపీబీఓలు, టీపీఎస్‌లతోపాటు 61 మంది వార్డు ఆఫీసర్లకు డ్యూటీలు అప్పగించారు. 90 వేల దరఖాస్తులకు 72 బృందాలను ఏర్పాటు చేశారు. నగర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పర్యవేక్షిస్తున్న వారు.. స్థల యజమానులకు మొబైల్ ఫోన్‌లో సమాచారం ఇస్తున్నారు. సంబంధిత స్థలాల వద్ద యజమాని ఫొటో, కోడ్స్ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొంత మంది వార్డు ఆఫీసర్లు ఇదే అదనుగా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

**బ్లాక్‌మెయిల్ దందా..**

నిబంధనల ప్రకారం యజమాని స్థల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో నమోదైన మొత్తం సొమ్ముపై 14 శాతం ఫీజుగా విధిస్తున్నారు. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉన్న మార్కెట్ వాల్యూ మేరకు రెగ్యులరైజేషన్, మెయిన్ రోడ్డు, దాని వెనకాల, రెండు, మూడు లైన్ల మేరకు వేర్వేరుగా మార్కెట్ ఫీజు విలువను పరిగణనలోకి తీసుకుని లెక్కించాలి. కానీ.. మామూళ్ల కోసం కొంత మంది వార్డు ఆఫీసర్లు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. 2020 సంవత్సరానికి బదులుగా 2024 మార్కెట్ విలువ, ఇష్టమొచ్చినట్లు రోడ్ల వివరాల పేరుతో లెక్కలు వేస్తున్నారు. ఈ విధానం వల్ల కొంత మేరకు ఫీజు అధికమవుతోంది. ‘ఫార్మాలిటీ’ ఇస్తే అదనంగా పడే ఫీజు తక్కువ చేస్తామని, లేకపోతే ఎలా ఉంటే అలానే ఫీజు విధిస్తామంటున్నారు. అంతేకాకుండా ఎల్–1 టీపీబీఎస్, రెవెన్యూ ఆర్‌ఐలు, ఇరిగేషన్ ఏఈలను, ఎల్–2 ఏసీపీ, ఎల్–3 డిప్యూటీ కమిషనర్లందరికీ ప్రతీ ఫైలుకు ఎంతో కొంత సొమ్ము ముట్టజెబితే ఫైల్ క్లియర్ అవుతుందని చెబుతూ కొర్రీలు పెడుతున్నారు. ‘అందరినీ చూసుకుంటాం.. ప్రొసీడింగ్ కాపీ ఇప్పిస్తాం’ అని హామీ ఇస్తున్నారు. వారు అడిగిన సొమ్ము చెల్లించేందుకు కొందరు యజమానులు అంగీకరించకపోవడంతో 2024 మార్కెట్ విలువతో ఫీజు విధిస్తున్నారు. దీనిపై అనుమానం వచ్చిన ముగ్గురు స్థలాల యజమానులు లైసెన్స్ సర్వేయర్లను ఆశ్రయించి లెక్కలు వేయించారు. మార్కెట్ విలువ, రోడ్డు నెట్ వర్క్‌లో తేడాలు తదితర అంశాల తప్పుడు లెక్కలపై యజమానులు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా వారి సూచన మేరకు రాష్ట్ర కంట్రీ అండ్ టౌన్ ప్లానింగ్ టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇచ్చారు. తీరా వీళ్లకు డబ్బులు చెల్లించిన తర్వాత బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఆపై ఆఫీసర్ల సంగతి ఎలా? ఉంటుందోననే సందేహాలు అప్పుడే మొదలయ్యాయి.

**ఏం లేదా మరి?**

కొంత మంది వార్డు ఆఫీసర్లు ‘ఫార్మాలిటీ’ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి, ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసినందుకు గాను ఏమీ లేదా? ఇంత దూరం వచ్చాం.. అంటున్నారు. చేసేదిలేక ఎంతో కొంత ఇవ్వకపోతే ఎక్కడ కొర్రీలు పెడతారోనంటూ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు.

**ఎవరికీ డబ్బులివ్వొద్దు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎవరికీ డబ్బులివ్వొద్దు. నిబంధనల మేరకు డాక్యుమెంట్లు, స్థలం ఉంటే ఫైల్ ప్రాసెస్ జరుగుతుంది. తదుపరి ఫీజు ఎంత చెల్లించాలనే విషయం మొబైల్ ఫోన్‌లో సమాచారం వస్తుంది. ఆ ఫీజులు చెల్లిస్తే వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ జారీ అవుతుంది. ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– రవీందర్ వాడేకర్, బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్

## 3 వరకు కేంద్ర బృందం పర్యటన

**అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

**హన్మకొండ అర్బన్ :** జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును కేంద్ర మానవాభివృద్ధి వనరుల సంస్థ అధికారుల బృందం డిసెంబర్ 3వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించనుందని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పర్యటనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర బృందం ధర్మసాగర్ మండలం ధర్మసాగర్, తాటికాయల, పెద్ద పెండ్యాల, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, కామారం, పెంచికలపేట గ్రామాలతో పాటు పరకాల మున్సిపాలిటీని సందర్శించనుందని చెప్పారు. ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు, కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాల బలోపేతానికి చేపట్టిన చర్యలు, నిరుపేదలకు అందించే జాతీయ భద్రత పెన్షన్(ఎన్‌ఎస్‌ఏపీ), నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా అమలవుతున్న వైద్య సేవలను పరిశీలిస్తుందన్నారు. తొలిరోజు పర్యటనలో భాగంగా ధర్మసాగర్ మండలంలో పరిశీలనకు వెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేశ్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- అధికారులు, ఫుడ్ సప్లయర్స్‌తో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ అర్బన్:** నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మెనూ ప్రకారం భోజనం అందించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే భోజనం అమలు తీరు, ఫుడ్ సేఫ్టీపై అధికారులు, ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఆహార పదార్థాలు, కూరగాయలు నాణ్యత లేకపోతే తిరిగి పంపించాలని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం.. అందించే భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే నోటీసులివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, డీఈఓ వాసంతి, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, జిల్లా పౌర సరఫరాల అధికారి కొమరయ్య, పౌరసరఫరాల శాఖ మేనేజర్ మహేందర్, ఆర్అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, వివిధ విద్యాసంస్థల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వైద్య ఆరోగ్య శాఖ కరదీపిక, కరపత్రం ఆవిష్కరణ**

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిన కరదీపికను కలెక్టర్ పి.ప్రావీణ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ కరదీపిక వైద్యాధికారులకు చాలా ఉపయోకరంగా ఉంటుందని, ప్లానింగ్, సిబ్బందికి శిక్షణ అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, డీఆర్డీఓ మేన శ్రీను, జెడ్పీ సీఈఓ విద్యాలత, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు నారాయణ, రమేశ్, డీఈఓ వాసంతి, జిల్లా సంక్షేమాధికారి జయంతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి


- డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే
- తల్లిదండ్రుల సంరక్షణ చట్టంపై సదస్సు




మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

**హన్మకొండ అర్బన్:** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సలహాలను బాధితులు వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే కోరారు. తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం–2007పై జిల్లా సంక్షేమ శాఖ అధ్యక్షతన జిల్లా న్యాయసేవాధికార సంస్థ, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. బాధితులెవరైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అధికారులంతా సంబంధిత కార్యాలయాలన్నింట్లో వృద్ధులకు ప్రత్యేక సేవలందించాలన్నారు. కార్యాలయాలకు వచ్చే వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సత్వర సేవలందించాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో వయోవృద్ధుల చట్టంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధులను వారి పిల్లలు, కుటుంబీకులు పట్టించుకోకపోతే ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవీ గణేశ్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, కె.నారాయణ, హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ అధికారి శ్యాంకుమార్, ఎఫ్‌ఆర్‌ఓ రవికృష్ణ, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ విద్యారణ్యపురి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వినతులు సత్వరమే పరిష్కరించాలి





ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

**కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య**

**వరంగల్/హన్మకొండ అర్బన్:** ప్రజావాణి వినతులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఆయా కలెక్టరేట్లలో సోమవారం వేర్వేరుగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. వరంగల్ ప్రజావాణికి 107 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు. హనుమకొండలో రెండు సోమవారాలు ఇతర కారణాలతో ప్రజావాణి నిర్వహించలేదు. దీంతో ఈసారి జనం భారీగా వచ్చి 156 వినతులు అందజేశారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను ఇతర ఉన్నతాధికారులు స్వీకరించారు.

# బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్





మానుకోట పట్టణంలో జరిగిన బీఆర్‌ఎస్ మహాధర్నాలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హాజరైన కార్యకర్తలు, ప్రజానీకం

- మానుకోట మహాధర్నాకు కదలివచ్చిన గిరిజనులు
- ఉత్సాహం నింపిన కేటీఆర్ ప్రసంగం

**మహబూబాబాద్:** లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన మహాధర్నా విజయవంతమైంది. మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మరో ఉద్యమానికి మానుకోట నాంది అవుతుందని చెప్పి వారిలో జోష్ నింపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10శాతానికి పెంచామని, తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్ ఇచ్చింది కేసీఆర్ అని చెబుతూ కార్యకర్తల నుంచి అవుననే సమాధానం రాబడుతూ.. ఉత్సాహం నింపారు. గిరిజనులు ఏకం కావాలని, ఎక్కడ అన్యాయం జరిగినా బీఆర్‌ఎస్ మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**నేతలు ఏం మాట్లాడారంటే..**

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గిరిజనుల భూములు లాక్కుంటే సీఎంను ఉరికించి కొడతారన్నారు. మహారాష్ట్ర ఫలితాలతోనైనా ముఖ్యమంత్రికి కనువిప్పు కలగాలని హితవు పలికారు.
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ గిరిజనులు, దళితులకు రక్షణ కవచంగా ఉంటే.. రేవంత్‌రెడ్డి వారి భూములను లాక్కుంటున్నారన్నారన్నారు. లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.
- మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతపాలన చేస్తున్నదని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతోనే కాంగ్రెస్ ఖేల్ ఖతమైందన్నారు.
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. సీఎం గిరిజనుల భూములు లాక్కొని అల్లుడికి ధారాదత్తం చేస్తామంటే ఎవరూ ఊరుకోరని, రాష్ట్ర వ్యాప్తంగా అందరిని ఏకం చేసి పోరాడుతుందన్నారు.
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో గిరిజనులు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, లగచర్ల రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు జగదీశ్వర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాతా మధు, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ హరిప్రియ, గండ్ర వెంకటరమణారెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, నరేందర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇంటర్‌వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీకి కేయూ జట్టు



కేయూ క్యాంపస్ : కర్ణాటక బెల్గావిలోని విశ్వేశ్వ రయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీలో నేటి నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న బ్యాడ్మింటన్ టోర్నీకి కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య సోమవారం తెలిపారు. ఎం.పూజితా రాగ ప్రియ ( కేయూసీఈటీ వరంగల్ )ఎస్.శ్రీనిత, పి.లక్ష్మి (వరంగల్ కిట్స్), కె.దీక్షిత (ఎస్‌డబ్ల్యూడీసీ, కొత్తగూడెం),ఎన్.అశ్విత (ఎంబిఎంఎస్ మంచిర్యాల) ఉన్నారు.

### నాగసాధువు అఘోరీపై కేసు

మామునూరు : శ్మశాన వాటికలో పూజలు చేసి తల్వార్‌తో కోడి తలను నరికి హింసకు పాల్పడిన నాగసాధువు అఘోరీ మాతపై మామునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపురం క్రాస్‌రోడ్డులోని హిందూ శ్మశానవాటికలో నాగసాధువు, అఘోరీమాత ఇటీవల పూజలు చేస్తు విచక్షణ రహితంగా కోడిని బలి ఇవ్వడంపై నేరంగా పరిగణించాలని కోరుతూ జంతుపరిరక్షణ సమితి ప్రతినిధి కరీంనగర్ జిల్లా మానుకొండురు మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కాసురెడ్డి రోహన్‌రెడ్డి సోమవారం మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అఘోరీ మాతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### ఇంజనీరింగ్ విద్యార్థుల ఆందోళన

- కళాశాల యాజమాన్య వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు అధిక మొత్తంలో జరిమానా విధించడమే కాకుండా సెమిస్టర్ ఫీజులకు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష ఫీజులు కూడా పెంచారని వాపోయారు. ఈక్రమంలో తమకు న్యాయం చేయాలని నినాదించారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేపట్టగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విద్యార్థులను క్యాంపస్‌లోకి పంపించి ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాలను దిగ్బంధించారు.

### గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

కాజీపేట: టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గుట్కాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు కాజీపేట పట్టణంలో సోమవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. గన్ను వెంకటేశ్వర్లు అనే వ్యాపారి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న రూ.20,430 విలువ చేసే నిషేధిత గుట్కాలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వాహనానికి బీమా తప్పనిసరి

- ప్రమాదం జరిగితే యజమానితో పాటు ఇతరులకు పరిహారం
- లేకుంటే జరిమానా తప్పదు

**మనం ఉపయోగించే వాహనాలకి తప్పనిసరిగా బీమా చేయించాలి.. కానీ ఈ విషయాన్ని అనేకులు వివిధ కారణాలతో విస్మరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 40 లక్షలకు పైగా వాహనాలుంటే వీటిలో సగం వాహనాలకు ఇన్సూరెన్స్ లేదని అధికారులు చెబుతున్నారు. వాహన బీమా ఉపయోగాలు, రకాలు, బీమా చేయించే విధానంపై అందరికీ పూర్తి స్థాయి అవగాహనపై ప్రత్యేక కథనం మీ కోసం..**



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు(ఫైల్)

కాజీపేట: కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి. అనుకోకుండా ప్రమాదంలో వాహనానికి నష్టం వాటిల్లితే కాంప్రహెన్సివ్ బీమాతో తగిన పరిహారం పొందే వీలుంది. థర్డ్ పార్టీ బీమాతో ప్రమాదం జరిగినట్లయితే డ్రైవర్‌కు లేదా ప్రయాణికులకు, ప్రమాదానికి గురైన వ్యక్తులకు నష్టపరిహారం వర్తిస్తుంది. వాహనాన్ని బట్టి ప్రతి ఏడాది బీమా చెల్లించాలి. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోయినా, రవాణా వాహనాలకు బ్యాడ్జి నంబర్ లేకపోయినా, వాహన పత్రాల కాల పరిమితి ముగిసిన తర్వాత ప్రమాదం జరిగినా బీమా కంపెనీలు నష్ట పరిహారం చెల్లించదు. దీనికి వాహన యజమానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. తనిఖీల సమయంలో బీమా లేని వాహనానికి అధికారులు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

**బీమాను ఎలా నిర్ణయిస్తారు..**

వాహనాలకు బీమా ఎంత లభిస్తుంది అనే దానిని ఇన్సూరెన్స్ డిక్లేర్డ్ వాల్యూ (ఐడీవీ) అంటారు. వాహనం పోయినా, ప్రమాదంలో పూర్తిగా పనికి రాకుండా పోయినా ఐడీవీని పాలసీదారుడికి చెల్లిస్తారు. వాహన వయస్సు ఆధారంగా ఈ ఐడీవీని చెల్లించాల్సి ఉంటుంది. వాహనం కొనుగోలు చేసిన నెలలోపు అయితే 5 శాతం, ఏడాదిలోపు 15 శాతం, ఏడాది తర్వాత 20, రెండేళ్లు దాటితే 30, మూడేళ్లు దాటితే 40, నాలుగేండ్లకు పైబడితే 50 శాతం తరుగుదల తీసేస్తారు.

**థర్డ్‌పార్టీ క్లెయిమ్..**

ప్రమాదానికి కారణమైన పాలసీదారుడు లేదా బాధితులు లేదా వారి తరఫున మరొకరు ప్రమాద సమాచారాన్ని వెంటనే బీమా కంపెనీకి, పోలీసులకు తెలియజేయాల్సి ఉంటుంది. థర్డ్‌పార్టీ కింద నష్టపరిహారం పొందేందుకు బాధితులు మోటారు వాహనాలకు సంబంధించిన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి ఉంటుంది. సొంత వాహనానికి ఏమైనా ప్రమాదం కారణంగా నష్టం జరిగితే వెంటనే బీమా కంపెనీకి సమాచారం ఇవ్వాలి. బీమా కంపెనీ ప్రతినిధులు వచ్చే వరకు వాహనాన్ని ప్రమాద స్థలంలో ఉంచాల్సి వస్తుంది. వాహనానికి సహజంగా జరిగే నష్టానికి బీమా కంపెనీలు నష్ట పరిహారం చెల్లించవు.

**బీమా లేని పక్షంలో...**

వాహనాలకు బీమా లేని సందర్భంలో రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధితులకు ఎటువంటి పరిహారం అందదు.పోలీసులు కేసు నమోదు చేసినప్పుడు ఇన్సూరెన్స్ పేపర్లు పోలీసులకు సమర్పించని పక్షంలో వాహనదారుడు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఆ తర్వాత విచారణలో జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

**బీమా రకాలు ఇలా..**

బీమా కంపెనీలు వివిధ రకాల పాలసీలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఇంజన్ ప్రొటెక్షన్, ఆయిల్ లీకేజీ, వేరే కారణాల వల్ల ఇంజన్‌కు నష్టం జరిగితే ఇంజన్ రీప్లేస్ చేసే విధంగా బీమా చేసుకునే వీలుంది. వాహనం దొంగతనానికి గురైనా లేక ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కొత్త వాహనాన్ని పొందే విధంగా పాలసీలు ఉన్నాయి. వాహన ప్రమాదంలో యజమాని లేదా ప్రయాణికులు, ఇతరులు మృతి చెందినా, అంగవైకల్యం పొందినా నష్టపరిహారం పొందేందుకు అనేక రకాల పాలసీలు అందుబాటులోకి వచ్చాయి.

**ఏడాదికోసారి బీమా చెల్లించాలి**

ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి తమ వాహనానికి సంబంధించి బీమా తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. బీమా చేయించలేని వాహనాలను రవాణా శాఖ అధికారులు ఎన్నిసార్లు పట్టుకుంటే అన్నిసార్లు జరిమానా చెల్లించాల్సిందే. మూడేళ్లకో సారి బీమా చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఇందుకు 20 నుంచి 30 శాతం వరకు ప్రీమియంలో మినహాయింపు ఇస్తున్నాయి.

# పల్లెనుంచి పరిశోధనల వరకు..

- రూర్కెలా ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న కార్తీక్‌రెడ్డి
- సింగపూర్ సదస్సులో సోలార్ విద్యుత్ నాణ్యతపై పరిశోధన పత్రం ప్రదర్శన



మర్కాల కార్తీక్‌రెడ్డి

నర్సంపేట : పల్లెటూరులో మొదలైన తన ప్రస్థానం విదేశాలకు పాకింది. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినప్పటికీ మేనమామ, అమ్మమ్మ సహకారంతో చదువును కొనసాగించాడు. ఉన్నత చదువులు చదివి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చాడు. రాష్ట్ర సరిహద్దులు దాటి ఒడిశాలోని ప్రతిష్టాత్మక రూర్కెలా ఎన్ఐటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన మర్కాల కార్తీక్‌రెడ్డి గౌరవ డాక్టరేట్ పొందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు అభినందనలు తెలిపారు.

**విద్యాభ్యాసం...**

నర్సంపేటకు చెందిన కార్తీక్‌రెడ్డి మేనమామ, అమ్మమ్మల సహకారంతో చదువును కొనసాగించాడు. కొమ్మాల ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి, నర్సంపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేశాడు. అనంతరం ఉన్నత విద్య పూర్తి చేసి రూర్కెలా ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ పొందాడు.

**పరిశోధన ఇలా...**

కార్తీక్‌రెడ్డి ఎన్ఐటీ రూర్కెలా ఈఈఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వెంకటరమణ నాయక్, ప్రొఫెసర్ అనూప్‌కుమార్‌పాండా పర్యవేక్షణలో సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కి అనుసంధానం చేస్తూ విద్యుత్ నాణ్యతను పెంచే విధంగా మల్టీఫంక్షనల్ సిస్టంను అభివృద్ధి చేశాడు. దీనికి గాను పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఆయన చేసిన పరిశోధనా ఫలితాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో, సదస్సులలో ప్రచురించబడ్డాయి.



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కార్తీక్‌రెడ్డి

**సింగపూర్‌లో ప్రదర్శనలు..**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐఈఈఈ సంస్థ గతేడాది సింగపూర్‌లో నిర్వహించిన ఐఈకాన్ అంతర్జాతీయ సదస్సులో కార్తీక్‌రెడ్డి తన పరిశోధన ఫలితాన్ని ప్రదర్శించడం జరిగింది. వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొని ఈ సదస్సులో మల్టీ ఫంక్షనల్ సోలార్ సిస్టం అడాప్టివ్ ఫిల్టరింగ్ కంట్రోల్ స్కిమ్స్ ద్వారా నియంత్రించబడుతూ చాలా సులువుగా సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కి అనుసంధానం చేస్తూ విద్యుత్ నాణ్యతలో ఎదురయ్యే వివిధ సమస్యలను అధిరోహిస్తుందని వివరించాడు. అలాగే సోలార్ ఎనర్జీ అందుబాటులో లేని సమయంలోనూ విద్యుత్ నాణ్యతను పెంచడం ఈ సిస్టం ప్రత్యేకత అని తెలిపాడు. కాగా పోస్ట్ డాక్టరల్ ఫెలోగా అత్యున్నత పరిశోధన చేయడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

**అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..**

నర్సంపేటలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో పదేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసి ప్రస్తుతం బెంగళూరులోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

**అభినందనలు..**

పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రెసిడెన్సీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిస్సార్ అహ్మద్, అధ్యాపక బృందం, బంధువులు, సన్నిహితులు కార్తీక్‌రెడ్డిని అభినందించారు.

### రామప్పలో భక్తుల సందడి

వెంకటాపురం(ఎం) : మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు



స్వామివారి సన్నిధిలో భక్తులు

## వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి



సుక్కమ్మ (ఫైల్)

నర్మెట : విషపురుగు కాటుతో మహిళ మృతిచెందిన సంఘటన కన్నెబోయినగూడెం బీక్యాతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు బీక్యాతండాకు చెందిన బానోత్ సుక్కమ్మ (49) ఓ రైతుకు పని నిమిత్తం కూలీకి వెళ్లింది. ఈక్రమంలో తనకు నీరసంగా, కళ్లు తిరుగుతున్నట్టుగా ఉందని తెలపడంతో వెంకిర్యాలలోని ఆర్ఎంపీకి వద్దకు తీసుకెళ్లారు. నోటి నుంచి నురుగు వస్తున్న ఆమెను పరీక్షించిన వైద్యుడు మృతిచెందినట్లు తెలిపాడు. కాగా భర్త సీతారాం ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ హిదాయత్‌అలీ తెలిపారు.

**బావిలో పడి రైతు..**

గూడూరు : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని అప్పరాజ్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్ద నరేష్ (38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టాలని బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి బావి వద్దకు వెళ్లి చూశారు. బావి దగ్గర చెప్పులు, సెల్‌ఫోన్ మాత్రమే ఉన్నాయి. దీంతో వారు బావిలో దిగి చూడగా నరేష్ మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు జారి వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు నరేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

**పాముకాటుతో బాలుడు..**



కార్తీకేయ మృతదేహం

కాటారం : పాము కాటుకు గురైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాటారం మండల కేంద్రంలోని గారెపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలుకు చెందిన ఉప్పలపాటి సత్యనారాయణ కుమారుడు వేదాన్ష్ కార్తీకేయ(4) గారెపల్లిలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 21న సాయంత్రం వేదాన్ష్ కార్తీకేయ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థత గురికాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### బెదిరింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి : వ్యవసాయ భూములు, ఇంటి స్థలాల తగాదాలో దాయాదుల బెదిరింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని నక్కపాక్కల తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ నరసింహ, లక్ష్మి, గుగులోత్ తిరుపతి, జ్యోతి, గుగులోత్ దేవయ్యలు గుగులోత్ కిష్టయ్యపై చేయి చేసుకొని చంపుతామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిష్టయ్య ద్విచక్రవాహనంపై ఊరు అవతలకి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కిష్టయ్య భార్య భూలమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేష్ తెలిపారు.

# మమ్మల్ని విడిచిపోతివా బిడ్డా..

- లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- ఉద్యోగంలో చేరిన నెలరోజులకే కాటేసిన మృత్యువు
- కొలువు రాకున్న బతికేవాడివి.. అంటూ రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఉపేందర్‌రావు (ఫైల్)

బయ్యారం : మంచి రోజులు వచ్చాయనుకుంటే మమ్మల్ని విడిచి పోతివా బిడ్డా.. ఉద్యోగం లేకున్నా నా కొడుకు ఇన్నేళ్లు మమ్మల్ని సాదుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే మంచి రోజులు వచ్చాయనుకున్నాం.. కాని ఇలా మమ్మల్ని విడిచి వెళ్లే రోజు వస్తుంది అనుకోలే కొడుకా.. అంటూ మృతి చెందిన ఉపేందర్‌రావు వృద్ధ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరును పలువురిని కన్నీటి పర్యంతం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుటుంబంతో సంతోషంగా ఉండొచ్చని భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకొన్న కొత్త ఉద్యోగికి నెలరోజుల్లోనే దురదృష్టం లారీ రూపంలో మృత్యువు కబళించింది. కొలువుకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన కొడుకు లారీ ఢీకొని కానరానిలోకాలకు వెళ్లాడని తెలిసిన తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య, కన్నపిల్లలు విషాదంలో మునిగిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంధంపల్లి-కొత్తపేట గ్రామానికి చెందిన సంద్ర ఉపేందర్‌రావు (45) డిగ్రీ, డీఈడీ అభ్యసించారు. దీంతో కొంతకాలం ప్రైవేటు టీచర్‌గా పనిచేసి ఆ తర్వాత పెట్రోల్‌బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. ఉద్యోగ అర్హత వయసు అయిపోతుంది అనుకున్న సమయంలో ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో గంగారం మండలం పులుసంవారిగుంపు (మరిగూడెం)పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు.



భార్య పిల్లలతో ఉపేందర్‌రావు (ఫైల్)

**నెలరోజుల్లోనే ఆశలు ఆవిరి..**

సామాన్య కుటుంబానికి చెందిన ఉపేందర్‌రావుపై భార్య స్వప్న, కుమారుడు హేమతేజ్, కుమార్తె శాన్వితతో పాటు తల్లిదండ్రులు హరినాథ్, జయమ్మ ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణకు పెట్రోల్‌బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ కలను నెరవేర్చుకున్నాడు. విధులు నిర్వర్తించేందుకు వెళ్తున్న ఉపేందర్‌రావును లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

**బైక్‌ను ఢీకొన్న లారీ**

గంగారం : ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని వెనకాల నుంచి లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన సంద్ర ఉపేందర్‌రావు (45) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితమే గంగారం మండలంలోని మర్రిగూడెం పులసంవారిగుంపు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. రోజు ఇంటినుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో గంగారం నుంచి కాటినాగారం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఉపాధ్యాయుడిని వెనకాల నుంచి వస్తున్న ఏపీ 02టీసీ 7088 నంబర్ గల లారీ వాహనం ఢీకొట్టడంతో ఉపేందర్‌రావు తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

### ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం



సురేశ్ (ఫైల్)

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నర్సింగ సురేశ్ (38) సోమవారం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ సురేశ్ రోజు వారి డ్రైవర్‌గా వెళ్తు జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గొరిగె సంపత్ ట్రాక్టర్ నడిపేందుకు తాత్కాలిక డ్రైవర్‌గా వెళ్లి ఓ రైతు పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి సురేశ్ అందులో ఇరుక్కుపోయాడు. దీంతో సమీపంలోని రైతులు గమనించి పొక్లెయినర్‌తో ట్రాక్టర్‌ను తొలగించి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు జనగామ ఏరియాఆస్పత్రికి మృతదేహన్ని తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



# ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

- మౌలిక సదుపాయాలు కల్పించాలి
- గ్రేటర్ గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: అనుమతులు లేని భవన నిర్మాణాలు, ప్లాన్‌కు విరుద్ధంగా, స్థలాల కబ్జాలకు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, కనీసం తనిఖీ చేయడం లేదని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ఫిర్యాదులు చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రీవెన్స్‌కు 88 ఫిర్యాదులు అందగా.. అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42 ఫిర్యాదులు వచ్చాయి. కాలనీల్లో మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలపై వినతులు సమర్పించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, సకాలంలో పరిష్కారించాలని కమిషనర్ అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కాగా.. ఇంజనీరింగ్ సెక్షన్‌కు 21, ప్రజారోగ్య విభాగానికి 12, పన్నుల సెక్షన్‌కు 9, టౌన్ ప్లానింగ్‌కు 42, తాగునీటి సరఫరాకు 3, ఉద్యాన వన విభాగానికి-1 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, హెచ్ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్ఓ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుల్లో కొన్ని..**

- గవిచర్ల క్రాస్ రోడ్డు 19-10-187 రోడ్డు అమృత్ నల్లా కనెక్షన్ల కోసం తవ్వకాలు జరిపి వదిలేశారని, అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని కొత్త రోడ్డు వేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ కీర్తినగర్‌లో రెండో రోజులకోసారి నల్లా నీరు వస్తోందని, కొందరు మోటార్లు పెట్టడంతో చివరి ఇంటి వరకు నల్లా నీరు అందడం లేదని పరమేశ్వర్ విన్నవించారు.
- వరంగల్ 16వ డివిజన్‌లో కొన్నేళ్లుగా రోడ్లు, డ్రెయినేజీ లేదని.. నిర్మించాలని కొత్త శివబాలరాజు కోరారు.
- 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు పారేందుకు డ్రెయినేజీ లేదని నిర్మించాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- ఆరేపల్లిలో ఓ వ్యక్తి ప్లాన్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని, నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.
- కాశిబుగ్గ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం చేస్తున్నామని, లైటింగ్, తాత్కాలిక షెడ్లు, వాటర్ సౌకర్యం కల్పించాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు.
- 32వ డివిజన్ బీఆర్ నగర్, రాజీవ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- 41వ డివిజన్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల్ని అసంపూర్తిగా వదిలేశారని, పూర్తిగా నిర్మించాలని వలుపదాసు కృష్ణ విన్నవించారు.
- జాన్‌పాకలో సీసీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- కొత్తవాడ 23వ డివిజన్‌లోని 11-25-938 నుంచి 956 వరకు డ్రెయినేజీ లేకపోక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ అడెపు స్వప్న వినతి పత్రాన్ని అందజేశారు.
- వరంగల్ శివనగర్ మైసయ్య నగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదని వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.
- అండర్‌రైల్వే గేట్‌లోని 31, 38, 39, 41 డివిజన్లకు మైసయ్య నగర్‌లోని దళిత శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని పలు కాలనీవాసులు రఖాస్తు అందచేశారు.
- గొర్రెకుంట మదర్ థెరిస్సా కాలనీలో బస్ షెల్టర్ నిర్మించాలని కాలనీ ఐక్యత సేవ సంఘం ప్రతినిధులు విన్నవించారు.
- హనుమకొండ లష్కర్ బజార్-8లో సీసీ రోడ్డు నిర్మాణం 25 శాతం నిర్మించి వదిలేశారని, మిగిలిన రోడ్డు నిర్మించాలని కుముదుసీసింగ్ వినతిపత్రాన్ని అందజేశారు.
- హనుమకొండ యాదవనగర్ 3-9-275 ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.
- 17వ డివిజన్ ఆదర్శనగర్‌లో ఇంటి నంబర్లు ఇవ్వాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 61వ డివిజన్ సిద్దార్థనగర్ కాలనీలో బల్దియా స్థలంలో పిల్లల పార్కు నిర్మించాలని సిద్ధార్థ నగర్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.